# బలగం BALAGAM TV

BALAGAM TV DIGITAL NEWS PAPER | balagamtv100@gmail.com

హైదరాబాద్ ఆదివారం 28 సెప్టెంబర్ 2025 | www.balagamtv.com | పేజీలు 4


## విజయ్ ర్యాలీలో తొక్కిసలాట..

- **36 మంది మృతి**



**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

టీవీకే అధినేత విజయ్‌ర్యాలీలో తొక్కిసలాట చోటుచేసుకుంది. ఈ ఘటనలో 36 మంది మృతి చెందారు. పలువురికి తీవ్ర గాయాలయ్యారు. క్షతగాత్రులను కరూర్ ఆసుపత్రికి తరలించారు. మృతులతో ముగ్గురు చిన్నారులు ఉన్నట్టు స్థానిక ఆసుపత్రి వర్గాలు తెలిపాయి. అనుకున్న సమయానికి ఆరు గంటలు ఆలస్యంగా విజయ్ చేరుకోవడంతో ఆయనను చూసేందుకు ఒక్కసారిగా అభిమానులు ఎగబడటంతో ఈ ఘటన చోటుచేసుకున్నట్టు తెలుస్తోంది. తొక్కిసలాట ఘటనపై సీఎం స్టాలిన్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.

## తెలంగాణను

# దేశానికే మోడల్‌గా నిలబెడదాం

**గ్రూప్ -1 ఉద్యోగాలకు ఎంపికైన వారు తెలంగాణ పునర్నిర్మాణంలో భాగస్వాములు కావాలి**

**ఉద్యోగులు తల్లిదండ్రులను నిర్లక్ష్యం చేస్తే వారి జీతాల్లో 10 శాతం కోత పెట్టి తల్లిదండ్రుల ఖాతాల్లో వేసే చట్టం తెస్తాం.**



**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

కొత్తగా గ్రూప్ -1 ఉద్యోగాలకు ఎంపికైన యువతీ యువకులు తెలంగాణ పునర్నిర్మాణంలో భాగస్వాములు కావాలని ముఖ్యమంత్రి శ్రీ రేవంత్ రెడ్డి గారు పిలుపునిచ్చారు. "తెలంగాణ భవిష్యత్ నిర్మాణ బాధ్యత మీ చేతుల్లో ఉంది. ఒక బాధ్యతతో వ్యవహరించండి. మనమంతా కలిసి తెలంగాణను దేశానికి ఒక మోడల్‌గా నిలబెడదాం" అని దిశానిర్దేశం చేశారు. హైదరాబాద్ శిల్పకళా వేదికలో ప్రజా పాలన - కొలువుల పండుగలో భాగంగా తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ నిర్వహించిన గ్రూప్-1 లో ఎంపికైన 562 మంది అభ్యర్థులకు ముఖ్యమంత్రి నియామక పత్రాలను అందించారు.ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, గారు, ఇతర మంత్రులు, ప్రజాప్రతినిధులతో కలిసి కార్యక్రమంలో పాల్గొన్న ముఖ్యమంత్రి, ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థులకు, వారి తల్లిదండ్రులకు శుభాభినందనలు తెలియజేశారు.

ఈ సందర్భంగా మాట్లాడుతూ.. "గ్రూప్-1 కు ఎంపికైన అభ్యర్థుల భుజాలపై తెలంగాణ భవిష్యత్తు పునర్నిర్మాణ బాధ్యత ఉంది. ఇదొక గొప్ప అవకాశం. బాధ్యతతో వ్యవహరించి నియామకాలు చేపట్టాం. ప్రభుత్వం ఒక గొప్ప లక్ష్యంతో ముందుకు వెళుతోంది. స్వాతంత్ర్యం వచ్చి వందేళ్లు పూర్తయ్యే 2047 నాటికి తెలంగాణ 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక శక్తిగా ఎదగాలన్న లక్ష్య సాధనలో మీ వంతు పాత్ర పోషించాలి. గుజరాత్ మాడల్ అనో, ఇంకేదో అనో కాదు. మన పోటీ దేశంతోనే కాదు. ప్రపంచంతో పోటీ పడే విధంగా తెలంగాణను తీర్చిదిద్దాలి. అందుకు కంకణబద్ధులై పనిచేయండి.

?ఉద్యోగంలో చేరిన కొత్తలో గరం, గరంగా ఉండి, తర్వాత నరం, నరంగా మారి క్రమేణా బేషరంగా మారుతారన్న నానుడి తప్పు అని నిరూపించే బాధ్యత మీపై ఉంది. ఒక నిరుపేద, నిస్సహాయుడు మీవద్దకు వచ్చినప్పుడు వారికి సేవ చేసే విషయంలో మీ తల్లిదండ్రులు గుర్తుకు రావాలి. మీరంతా నిన్నటి వరకు నిరుద్యోగ యువకులు. ఈ రోజు నుంచి ఆఫీసర్లు. ఆఫీసర్లకు ఎంతో బలం ఉంది. మీ భవిష్యత్తుకు అది గ్రీన్ చానెల్. మీ భవిష్యత్తును తీర్చిదిద్దాలని రూపాయి, రూపాయి కూడబెట్టి మీకోసం సర్వం త్యాగం చేసిన మీ తల్లిదండ్రులను బాగా చూసుకోవాలి. ఉద్యోగులెవరైనా తల్లిదండ్రులను నిర్లక్ష్యం చేస్తే వారి జీతాల్లో 10 శాతం కోత పెట్టి తల్లిదండ్రుల ఖాతాల్లో వేసే చట్టం తెస్తాం.

గ్రూప్ -1 ఉద్యోగం సాధించడానికి 3 లక్షలకుపైగా అభ్యర్థులు పోటీ పడితే అందులో 562 మంది ఎంపికయ్యారు. మీలో ఉన్న నైపుణం, చైతన్యం, పట్టుదల కారణంగా మీరు తెలంగాణ అభివృద్ధికి భాగస్వామ్యులయ్యారు. ఉమ్మడి రాష్ట్రంలో 2011 లో గ్రూప్ 1 నిర్వహిస్తే ఆ తర్వాత గత ప్రభుత్వం గ్రూప్ -1 నిర్వహించాలన్న ఆలోచన చేయలేదు.ఏ ఆకాంక్ష కోసం తెలంగాణ ఏర్పాటు చేసుకున్నామో, గడిచిన పదేండ్లలో ఆ ఆకాంక్ష నెరవేరలేదు. తెలంగాణ కోసం ఎంతో మంది ప్రాణ త్యాగం వల్ల సాధించిన తెలంగాణ ఒక కుటుంబ ప్రయోజనం కోసం కాదు.

పెద్ద పెద్ద ఉద్యోగాలను నియమించే పబ్లిక్ సర్వీస్ కమిషన్ చిన్న చిన్న హోదాల్లో ఉన్న వారిని నియమించడమే కాకుండా ఆ రోజు ప్రశ్నాపత్రాలు పల్లీబఠాణీలుగా జిరాక్స్ సెంటర్లలో లభించే విధంగా పోటీ పరీక్షలను అపహాస్యం చేశారు.ప్రజా ప్రభుత్వం అధికారం చేపట్టిన తర్వాత పబ్లిక్ సర్వీస్ కమిషన్‌ను యూపీఎస్సీ కన్నా ఉన్నతంగా ఉంచాలని కమిషన్‌ను ప్రక్షాళన చేశాం. అది నచ్చని కొంతమంది కడుపుమంటతో చేయని ప్రయత్నాలు లేవు. ఉద్యోగాలను అమ్ముకున్నారని అపవాదు వేశారు. నేను, మంత్రివర్గ సహచరులం మంచి చేయాలన్న ఒక సంకల్పంతో పనిచేశాం.ఆరోపణలు చేసినప్పటికీ ఓపికతో దిగమింగుకున్నాం. డిసెంబర్ అసెంబ్లీ ఎన్నికల ఫలితాల సమయంలో కూడా అంత ఆందోళన చెందలేదు. కానీ గ్రూప్-1 కోసం ఆందోళన చెందా. ఒక మంచి సంకల్పంతో పని చేసినప్పుడు లక్ష్యం ముందుండాలి తప్ప మరొకటి కాదు" అని ఉద్ఘాటించారు.ఈ కొలువుల పండుగలో మంత్రులు పొన్నం ప్రభాకర్ గారు, జూపల్లి కృష్ణారావు గారు, పొంగులేటి శ్రీనివాస రెడ్డి గారు, వాకిటి శ్రీహరి గారు, ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, వివిధ కార్పొరేషన్ చైర్మన్లు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు గారు పాల్గొన్నారు. ఈ

## జెడ్పీ రిజర్వేషన్లు ఖరారు

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

జెడ్పీ చైర్మెన్, చైర్‌పర్సన్ల రిజర్వేషన్లకు సంబంధించిన గెజిట్‌ను రాష్ట్ర సర్కారు విడుదల చేసింది. ఎస్టీలకు 4, ఎస్సీలకు 6, బీసీలకు 13, జనరల్ కేటగిరికి 8 జెడ్పీ పీఠాలను కేటాయిస్తూ నిర్ణయం తీసుకున్నది. 15 జిల్లాలను మహిళలకు కేటాయించింది. ఈ మేరకు పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ డైరెక్టర్ సృజన ఒక ప్రకటన విడుదల చేశారు. ఖమ్మం, వరంగల్ (ఎస్టీ), ములుగు, నల్లగొండ(ఎస్టీ మహిళ)కు కేటాయించబడ్డాయి. ఎస్సీ మహిళలకు రంగారెడ్డి, హన్మకొండ, జనగామ, ఎస్సీజనరల్ కేటగిరిలో జోగులాంబ గద్వాల, రాజన్నసిరిసిల్ల, సంగారెడ్డి జెడ్పీ పీఠాలను ఖరారు చేశారు. బీసీ జనరల్ కేటగిరీలో జయశంకర్ భూపాలపల్లి, కరీంనగర్, కొమ్రంభీం అసిఫాబాద్, నిర్మల్, సిద్దిపేట, సూర్యాపేట, వికారాబాద్ జిల్లాలున్నాయి. బీసీ మహిళల కోటాలో మహబూబ్‌నగర్, మంచిర్యాల, నాగర్‌కర్నూల్, నిజామాబాద్, వనపర్తి, యాదాద్రి భువనగిరి జిల్లాలున్నాయి. జనరల్ మహిళ కేటగిరీలో ఆదిలాబాద్, జగిత్యాల, నారాయణపేట, పెద్దపల్లి, జనరల్ కోటాలో భద్రాద్రి కొత్తగూడెం, కామారెడ్డి, మహబూబాబాద్, మెదక్ జిల్లాలున్నాయి. ఎంపీటీసీ, ఎంపీపీ, జెడ్పీటీసీల రిజర్వేషన్ల వివరాలను జిల్లాల వారీగా విడుదల చేశారు.


## ఉగ్రవాదుల చొరబాటులను సైన్యం అడ్డుకుంటోంది

- **బీఎస్ఎఫ్ ఇన్స్పెక్టర్ జనరల్ అశోక్ యాదవ్**

**బలగం టీవీ, శ్రీనగర్**

అంతర్జాతీయ సరిహద్దును దాటిన పాకిస్థాన్ ప్రేరేపిత ఉగ్రవాదులు భారత్‌లోకి చొరబడేందుకు ప్రయత్నిస్తుండగా, భారత సైన్యం, బీహెచ్ఎఫ్ సమన్వయంతో వాటిని నిరంతరంగా తిప్పికొడుతున్నట్లు బార్డర్ సెక్యూరిటీ ఫోర్స్(బీఎస్ఎఫ్) ఇన్స్పెక్టర్ జనరల్ అశోక్ యాదవ్ తెలిపారు. అయితే ఉగ్రవాదులు తమ ప్రయత్నాలు కొనసాగిస్తున్నారని ఆయన పేర్కొన్నారు. అశోక్ యాదవ్ ప్రకారం, నియంత్రణ రేఖ (ఎల్ఓసీ) వద్ద ఉన్న లాంచ్‌ప్యాడ్‌లలో ఉగ్రవాదుల ఉనికిని గుర్తించామని, బాందిపోరా, కుప్వారా సెక్టార్లలో దృశ్యాలు, సమాచారం సేకరణ జరగుతున్నట్లు ఆయన వెల్లడించారు. ఉగ్రవాదులు కశ్మీర్ లోయలోకి చొరబాటుకు తగిన సమయాన్ని కోసం ఎదురుచూస్తున్నారని, అయితే బీఎస్ఎఫ్ మరియు సైన్యం ఎల్లప్పుడూ అలర్ట్ అని చెప్పారు. కశ్మీర్‌లోని భద్రతా సిబ్బంది ఉగ్రవాదుల చొరబాటులను భగ్నం చేయడానికి అప్రమత్తంగా ఉన్నారు. శీతాకాలం ప్రారంభానికి ముందు ఉగ్రవాదులు ప్రవేశించడానికి ప్రయత్నిస్తుం టారని, అందువల్ల అన్ని భద్రతా యూనిట్లు సమన్వయంతో, నిరంతర పర్యవేక్షణలో పనిచేస్తున్నాయని తెలిపారు. అశోక్ యాదవ్ చెప్పినట్లుగా, నియంత్రణ రేఖ వద్ద పటిష్ట గోదాములు, నిఘా బాటలు, ర్యాపిడ్ రెస్పాన్స్ యూనిట్లు, ఇతర భద్రతా చర్యలు అమలు చేస్తున్నారు.

## రిజర్వేషన్లపై చట్టప్రకారంగానే ముందుకెళ్లాలి



- **ఎన్నికల నిర్వహణను వాయిదా వేస్తే నష్టమేంటి?**
- **బిల్లుకు గవర్నర్ ఆమోదం దక్కకుండానే జీవో ఏంటి?**
- **నోటిఫికేషన్‌కు ముందే పిటిషన్ వచ్చింది విచారించి ప్రభుత్వానికి ఉత్తర్వులిస్తాం**
- **రాష్ట్ర ప్రభుత్వం కౌంటర్ దాఖలు చేయాలి**
- **విచారణ అక్టోబర్ 8కి వాయిదా**
- **తెలంగాణ హైకోర్టు**


**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**


బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల విషయంలో చట్టప్రకారమే ముందుకెళ్లాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని హైకోర్టు ఆదేశించింది. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల జీవో చట్టబద్ధతను ప్రశ్నించింది. ఎన్నికల నిర్వహణను రెండు, మూడు నెలలు వాయిదా వేస్తే నష్టమేంటి? అని అడిగింది. ఎన్నికల నోటిఫికేషన్ విడుదల కాకముందే హైకోర్టులో పిటిషన్ దాఖలైంది కాబట్టి విచారణ చేస్తామనీ, ప్రభుత్వానికి ఉత్తర్వులు జారీ చేస్తామని స్పష్టం చేసింది. విచారణను అక్టోబర్ 8వ తేదీకి వాయిదా వేస్తున్నట్టు ప్రకటించింది.బీసీ రిజర్వేషన్ల జీవోపై దాఖలైన పిటిషన్‌పై హైకోర్టు శనివారం విచారించింది. రిజర్వేషన్ల జీవోను కొట్టివేయా లని మాధవరెడ్డి పిటిషన్ వేసిన విషయం తెలిసిందే. పిటిషన్‌పై జస్టిస్ అభినందన్, జస్టిస్ విజయ్‌సేన్‌రెడ్డి ధర్మాసనం విచారణ చేపట్టింది. బీసీలకు 42శాతం రిజర్వేషన్ల జీవోను సవాల్ చేస్తూ పిటిషన్ వేసిన మాధవ రెడ్డి.. బీసీ రిజర్వేషన్లను 27శాతం నుంచి 42శాతానికి పెంచారని ఆరోపించారు. మొత్తం రిజర్వేషన్ల పరిమితి 60శాతం దాటిందని.. రాజ్యాంగంలో 50శాతం రిజర్వేషన్లు దాటకూడదనే నిబంధన ఉందని పిటిషనర్ ప్రస్తావించారు. ఈ సందర్భంగా బీసీ రిజర్వేషన్ల జీవోను గెజిట్ చేశారా? అని కోర్టు ప్రశ్నించింది.

హైకోర్టు ప్రశ్నకు స్పష్టమైన సమాధానాన్ని పిటిషనర్ తరఫు న్యాయవాది ఇవ్వలేదు. దాంతో గెజిట్ చేయకముందే హైకోర్టును ఎందుకు ఆశ్రయించారని కోర్టు ప్రశ్నించింది. బీసీల రిజర్వేషన్ల జీవో గెజిట్ కాకపోవచ్చని హైకోర్టుకు తెలిపిన ఏజీ సుదర్శన్‌రెడ్డి. పంచాయతీరాజ్ చట్టం ప్రకారం రిజర్వేషన్లు 50శాతం మాత్రమే ఉండాలని పిటిషనర్ తరఫు న్యాయవాది తెలిపారు. నూతన జీవో వల్ల రిజర్వేషన్ పరిమితి 67శాతానికి చేరిందని.. బీసీ రిజర్వేషన్లు 35శాతం పెంచుతూ 2018లో జీవో ఇచ్చారన్నారు. 2018లో ఇచ్చిన జీవోను హైకోర్టు డివిజన్ బెంచ్ కొట్టివేసిందని తెలుపగా.. తమిళనాడులో రిజర్వేషన్లు 69శాతానికి పెంచారు కదా? అని హైకోర్టు ప్రశ్నించింది. తొమ్మిదో షెడ్యూల్‌లో పెట్టి రిజర్వేషన్ పెంచారని చెప్పిన పిటిషన్ తరఫున న్యాయవాది కోర్టుకు తెలిపారు. ప్రస్తుతం అది సుప్రీంకోర్టులో విచారణలో ఉందని పిటిషనర్ తెలిపారు. పంచాయతీరాజ్ చట్టంలోని మిగితా 2వ పేజీలో

# మూసీ ఉగ్రరూపం

- **మూసీ ఉధృతికి నీట మునిగిన ఇండ్లు**
- **ఎంజీబీఎస్‌లోకి భారీగా వరద**
- **ప్రయాణికులను సురక్షిత ప్రాంతాలకు తరలింపు**





**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

మూసీ నది హైదరాబాద్‌ను శుక్రవారం రాత్రి అతలాకుతలం చేసింది. నదిలో ఒక్కసారిగా వరద ఉధతి పెరిగిపోవటంతో నదికి ఇరువైపులా ఉన్న కాలనీలు పూర్తిగా నీట మునిగాయి. ఎన్నడూ లేనివిధంగా మహాత్మాగాంధీ బస్‌స్టేషన్‌ను కూడా వరద ముంచెత్తింది. ఒక్కసారిగా వరదనీరు బస్ స్టేషన్‌లోకి చొచ్చుకురావటంతో ప్రయాణికులు భయభ్రాంతులకు గురయ్యారు. బస్ స్టేషన్‌లోని ప్రయాణికులను హైడ్రా, ఎన్‌డీఆర్ఎఫ్ సిబ్బంది బయటకు తరలించారు. ముందు జాగ్రతగా మూసీ నదిపై ఉన్న లో లెవల్ వంతెనలన్నీ మూసేశారు. పురాణాపూల్, చాదర్‌ఘాట్, మూసారంబాగ్ కాజ్‌వేలను మూసేస్తూ ట్రాఫిక్ పోలీసు చీఫ్ జోయల్ డెవిస్ శుక్రవారం రాత్రి నిర్ణయం తీసుకున్నారు.

రంగారెడ్డి, వికారాబాద్ జిల్లాల్లో రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలతో మూసీ నదికి భారీ వరద పోటెత్తింది. దీంతో శుక్రవారం రాత్రి అధికారులు హిమాయత్‌సాగర్, ఉస్మాన్‌సాగర్ గేట్లను ముందస్తు హెచ్చరిక చేయకుండానే ఎత్తేయడంతో దిగువన ఒక్కసారిగా వరద ప్రవాహం పెరిగిపోయింది. వెంటనే స్పందించిన హైడ్రా, ఎస్‌డీఆర్ఎస్ విభాగాలు.. మూసీ వెంట ఉన్న కాలనీల్లోని ప్రజలను అప్రమత్తం చేశారు. లోతట్టు ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించారు. అధికారులు, పోలీ సులు మూసీ పరీవాహక ప్రాంతాల్లో పరిస్థితిని నిరంతరం పర్యవేక్షిస్తున్నారు.

1908లో కూడా సెప్టెంబర్ 26వ తేదీనే మూసీ నదికి వరదలు వచ్చాయి. అప్పుటి వరదలకు వేలాది మంది ప్రాణాలు కోల్పోగా, దాదాపు 20 వేల ఇండ్లు నేలమట్టమయ్యాయి. దీంతో హైదరాబాద్ నగరాన్ని వరదల నుంచి రక్షించడానికి ఉస్మాన్‌సాగర్, హిమాయత్‌సాగర్ జలాశయాలను నిర్మించారు. మళ్లీ ఇప్పుడు సెప్టెంబర్ 26వ తేదీన్నే మూసీ వరద ముంచెత్తడంతో నాటి ఘటనలను ప్రజలు గుర్తు చేసుకుంటున్నారు.

మూసీ పరివాహక ప్రాంతాల్లో నీరు చేరుతున్నదన్న సమాచారంతో రెవెన్యూ, జీహెచ్ఎంసీ పోలీసు శాఖలు అప్రమత్తమయ్యాయి. ముఖ్యంగా చాదర్‌ఘాట్, శంకర్‌నగర్, గోల్నాక డివిజన్ పరిధిలోని కష్ణానగర్, అంబేద్కర్ నగర్ ప్రాంతాల్లో నివసిస్తున్న ప్రజలను అధికారులు సురక్షిత ప్రదేశాలకు తరలించారు. పాఠశాల భవనాలు, కమ్యూనిటీ హాల్స్‌ను పునరావాస కేంద్రాలుగా మార్చి బాధితులకు ఆహారం, తాగునీరు, వైద్య సదుపాయాలు అందిస్తున్నారు. నది ఉధతి పెరగడంతో ముసారంబాగ్ బ్రిడ్జిని మూసేశారు. రాకపోకలను నిలిపేశారు. జంట జలాశయాలైన హిమాయత్ సాగర్, ఉస్మాన్ సాగర్ గేట్లు ఎత్తి దిగువకు నీటిని విడుదల చేస్తున్నారు. మూసీ పరివాహక ప్రాంతాల్లో రెడ్ అలర్ట్‌ను ప్రకటించారు.

మూసీ వరద ఉధతికి మహత్మాగాంధీ బస్ స్టేషన్ (ఎంజీబీఎస్) పూర్తిగా నీట మునిగి జలదిగ్బంధంలోకి వెళ్లిపోయింది. శుక్రవారం అర్ధరాత్రి వేళ వరద నీరు ఎంజీబీఎస్ ప్రాంగణంలోకి చేరడంతో, టీజీఎస్‌ఆర్టీసీ అధికారులు బస్సుల రాకపోకలను తాత్కాలికంగా నిలిపేశారు. ఎంజీబీఎస్ బస్ స్టేషన్‌కు వెళ్లే రెండు ప్రధాన బ్రిడ్జిలు నీట మునగడం పరిస్థితి తీవ్రంగా మారింది.


పురానాపూల్ ప్రాంతంలో మూసీ నీరు రోడ్లపైకి చేరింది. దీంతో వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడుతోంది. ట్రాఫిక్ పోలీసులు వాహనదారులకు ప్రత్యామ్నాయ మార్గాలను సూచిస్తున్నారు. జియగూడా ప్రాంతంలో మూసీ ఉధృతంగా ప్రవహిస్తోంది. అక్కడ రోడ్లపైకి నీరు రావడంతో పోలీసులు రూట్ బంద్ చేశారు. రహదారులపై బారికేడ్లు ఏర్పాటు చేసి వాహనదారులను అడ్డుకున్నారు. రోడ్లపైకి వస్తున్న వరద నీరు ప్రమాదకరమని హెచ్చరించిన పోలీసులు, అవసరం లేకపోతే బయటకు రాకూడదని స్థానికులకు సూచిస్తున్నారు. అధికారులు వరద పరిస్థితిని దష్టిలో ఉంచుకుని ప్రజలకు పలు సూచనలు చేశారు. నది పరివాహక ప్రాంతాల్లో ఎవ్వరూ ఉండవద్దనీ, మూసీ తీరప్రాంతాలకు వెళ్లి సెల్ఫీలు తీయడం, ఆటపాటలతో సమయం గడపడం ప్రమాదకరమని హెచ్చరించారు.

# అంతర్జాతీయ టెలికాం విపణిలోకి భారత్

- **బీఎస్ఎన్ఎల్ స్వదేశీ 4జీ స్టాక్ ఆవిష్కరించిన ప్రధాని మోడీ**

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

అంతర్జాతీయ టెలికాం విపణిలోని ప్రతిష్టాత్మక లీగ్‌లో భారత్ కూడా చేరింది. స్వదేశీ పరిజ్ఞానంతో అభివృద్ధి చేసిన బీఎస్ఎన్ఎల్ 4జీ స్టాక్ను శనివారం ప్రధాని నరేంద్ర మోదీ ఆవిష్కరించారు. ప్రధాని మోదీ ఈ సందర్భంగా, టెలికాం రంగంలో భారత్ ఇప్పుడు ప్రపంచ స్థాయి తయారీ కేంద్రంగా ఎదిగిందని పేర్కొన్నారు. ప్రస్తుత ఒడిశా పర్యటనలో ఆయన సుమారు రూ.60,000 కోట్ల విలువైన పలు అభివృద్ధి ప్రాజెక్టులను ప్రారంభించారు.



దాదాపు రూ.37,000 కోట్ల వ్యయంతో దేశవ్యాప్తంగా 97,500కు పైగా 4జీ మొబైల్ టవర్లు నిర్మించబడ్డాయి. ఈ టవర్లను ప్రధాని మోదీ జాతికి అంకితం చేశారు. పూర్తి స్వదేశీ పరిజ్ఞానంతో రూపొందిన ఈ టవర్లు మారుమూల, సరిహద్దు, మావోయిస్ట్ ప్రభావిత ప్రాంతాల్లో 2.2 కోట్ల మంది భారతీయులకు మెరుగైన కనెక్టివిటీ అందిస్తాయి. నెట్‌వర్క్ క్లౌడ్ ఆధారితంగా రూపొందించబడినందున భవిష్యత్తులో సులభంగా 5జీకి అప్‌గ్రేడ్ చేయవచ్చని అధికారులు పేర్కొన్నారు. ఈ ఆవిష్కరణతో భారత్ టెలికాం పరికరాల తయారీలో డెన్మార్క్, స్వీడన్, దక్షిణ కొరియా, చైనా వంటి దేశాల సరసన నిలిచింది. పూర్తి సౌరశక్తితో నడిచే ఈ టవర్లను భారతదేశంలోని అతిపెద్ద గ్రీన్ టెలికాం సర్వీస్గా పిలుస్తున్నారు. ప్రధాని మోదీ ఈ టెలికాం రంగ ఆవిష్కరణతో పాటు ఒడిశాలో పలు ఇతర అభివృద్ధి పథకాలను కూడా ప్రారంభించారు.

# పెట్టుబడులకు అండగా ప్రభుత్వం

**తెలంగాణలో రూ.15,279 కోట్ల పెట్టుబడులు : సీఎం రేవంత్‌రెడ్డి**



**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

తెలంగాణలో పెట్టుబడులకు ప్రభుత్వం అండగా నిలుస్తుందని ముఖ్యమంత్రి శ్రీ రేవంత్ రెడ్డి గారు పునరుద్ఘాటించారు. పర్యాటక రంగంలో ప్రపంచంలో సమున్నత స్థానంలో నిలబెట్టాలన్న లక్ష్యంతో ప్రభుత్వం పని చేస్తోందని స్పష్టం చేశారు. పెట్టుబడులకు, పర్యాటకులకు సంపూర్ణ రక్షణ కల్పిస్తామని చెప్పారు.ప్రపంచ పర్యాటక దినోత్సవం రోజున శిల్పారామం, సంప్రదాయ వేదికలో 'టూరిజం కాంక్లేవ్ -2025' లో ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క గారు, మంత్రులు జూపల్లి కృష్ణారావు గారు, వాకిటి శ్రీహరి గారు, సలహాదారు వేం నరేందర్ రెడ్డి గార్లతో కలిసి ముఖ్యమంత్రి గారు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా పర్యాటక రంగంలో వివిధ ప్రాజెక్టులపై ప్రభుత్వంతో కుదిరిన ఎంఓయూలను ముఖ్యమంత్రి సమక్షంలో అందజేశారు.ఈ సందర్భంగా కాంక్లేవ్‌ను ఉద్దేశించి ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. "తెలంగాణ ఏర్పడిన తర్వాత గత పదేళ్లుగా పర్యాటక రంగంలో రాష్ట్రానికి ప్రత్యేక విధానం లేదు. మా ప్రభుత్వం ప్రత్యేక పాలసీని ప్రకటించడమే కాకుండా మొట్టమొదటి తెలంగాణ టూరిజం కాంక్లేవ్ -2025 నిర్వహించడం అభినందనీయం.వివిధ టూరిజం ప్రాజెక్టుల కోసం 15 వేల కోట్ల రూపాయల మేరకు పెట్టుబడులను ఆకర్షించాం. టూరిజం రంగంలో పెట్టుబడులకు తెలంగాణలో ఎన్నో అవకాశాలు ఉన్నాయి. అందుకే, అధికారులు ఈ ఏడాది 50 వేల కోట్ల మేరకు పెట్టుబడులను సాధించాలని లక్ష్యంగా పెట్టుకోవాలి. హైదరాబాద్ నగరంలో చార్మినార్, గోల్కొండ లాంటి ఎన్నో చారిత్రక కట్టడాలు ఉన్నాయి. టైగర్ రిజర్వు, కవాల్ టైగర్ రిజర్వ్, వారసత్వ సంపదగా యునెస్కో గుర్తింపు పొందిన రామప్ప దేవాలయంతో పాటు, వేయి స్తంభాల గుడి, ఆలంపూర్ శక్తి పీఠాలు.. ఇలా చెప్పుకుంటూపోతే అనేక ప్రత్యేకతలున్న ప్రాంతాలున్నాయి. తెలంగాణలో అత్యుత్తమ, సాంస్కృతిక పర్యాటక ప్రాంతాలున్నాయి. అందుకే ఎకో టూరిజం, మెడికల్ టూరిజం, టెంపుల్ టూరిజం ఇలా అన్ని రంగాల్లో ప్రోత్సహిస్తున్నాం. గొప్ప సాంస్కృతిక వారసత్వం కలిగిన హైదరాబాద్ ఓల్డ్ సిటీ కాదు. ఒరిజినల్ సిటీ. ప్రపంచ నగరాలతో పోటీ పడాలన్న లక్ష్యాన్ని పెట్టుకున్నాం. ఐటీ, ఫార్మా రంగాలే కాదు. పర్యాటక రంగంలో పెట్టుబడులను ఆకర్షించాలి.ఆపరేషన్ సిందూర్ జరుగుతున్న సమయంలో మిస్ వరల్డ్ పోటీలను నిర్వహించాం. హైదరాబాద్ అత్యంత సురక్షితమైన నగరం. పెట్టుబడులు, పర్యాటకుల రక్షణ విషయంలో ప్రభుత్వం అండగా ఉంటుంది." అని ముఖ్యమంత్రి గారు చెప్పారు.ఈ కార్యక్రమంలో టూరిజం కార్పొరేషన్ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి గారు, తెలంగాణ ఫిలిమ్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ దిల్ రాజు గారు, టూరిజం శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేశ్ రంజన్ గారు, తెలంగాణ డీజీపీ జితేందర్ గారితో పాటు ఉన్నతాధికారులు పాల్గొన్నారు. టూరిజం రంగంలో ఉత్తమ సేవలు అందించిన వివిధ సంస్థలకు ఈ కార్యక్రమంలో అవార్డులను బహూకరించారు.

# బీఆర్ఎస్ 'బాకీ కార్డ్' ఉద్యమం



- **కాంగ్రెస్ చేసిన మోసాలను తెలంగాణ ప్రజలకు వివరించేందుకు...**
- **ఏ వర్గానికి కాంగ్రెస్ ప్రభుత్వం ఎంత బాకీ ఉందో తెలిసేలా "కాంగ్రెస్ బాకీ కార్డు" లు**
- **కాంగ్రెస్‌కు పంచాయతీ, జూబ్లీహిల్స్ ఎన్నికల్లో ప్రజలు తగిన బుద్ధి చెప్పాలి**
- **'కాంగ్రెస్ బాకీ కార్డు' పోస్టర్ ను ఆవిష్కరించిన కేటీఆర్**

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

అధికారం కోసం అడ్డమైన హామీలిచ్చి, గద్దెనెక్కిన తర్వాత వాటిని గాలికొదిలేసిన కాంగ్రెస్ ప్రభుత్వ మోసాలపై బీఆర్ఎస్ పార్టీ సమరశంఖం పూరించింది. ఎన్నికల ముందు ఇచ్చిన గ్యారెంటీలను తుంగలో తొక్కిన కాంగ్రెస్ సర్కార్.. రాష్ట్రంలోని ఏ వర్గానికి ఎంతెంత బాకీ పడిందో లెక్కలతో సహా ప్రజల ముందుంచేందుకు 'కాంగ్రెస్ బాకీ కార్డు' ఉద్యమాన్ని మొదలు పెట్టింది. ఇవాళ తెలంగాణ భవన్‌లో మాజీ మంత్రులతో కలిసి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఈ 'బాకీ కార్డు'పోస్టర్ ను విడుదల చేశారు.

ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడిన కేటీఆర్, కాంగ్రెస్ చేసిన మోసాలే నేడు ప్రజల చేతిలో పాశుపతాస్త్రాలుగా మారాయన్నారు. రాబోయే పంచాయతీ, జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో ఆ పార్టీకి తగిన బుద్ధి చెప్పాలని తెలంగాణ ప్రజలకు పిలుపునిచ్చారు. రాష్ట్రంలోని ప్రతి ఇంటి తలుపుతట్టి, కాంగ్రెస్ బాకీల బండారాన్ని ప్రజలకు వివరిస్తామని స్పష్టం చేశారు. కాంగ్రెస్ ఇచ్చిన గ్యారెంటీ కార్డుకు విరుగుడే ఈ 'బాకీ కార్డు' అన్నారు.

కాంగ్రెస్ ఇచ్చిన దోఖాకు బదులు తీర్చుకునే సరైన మోకా తెలంగాణ ప్రజలకు వచ్చిందన్నారు కేటీఆర్. ఏ వర్గానికి కాంగ్రెస్ ఎంత బకాయి పడ్డదో నిలదీసి నిగ్గదీసి అడగడానికే ఈ బాకీ కార్డు ఉద్యమాన్ని ప్రారంభించామన్నారు. రాష్ట్రస్థాయి నాయకుల నుంచి గ్రామస్థాయి కార్యకర్తల వరకు ప్రతి ఒక్కరూ ఈ కార్డును ఇంటింటికీ తీసుకెళ్తారని చెప్పారు. వంద రోజుల్లో హామీలన్నీ అమలు చేస్తామని మోసం చేసిన కాంగ్రెస్ కు ప్రజలు తగిన బుద్ధి చెప్పాలని కేటీఆర్ పిలుపునిచ్చారు.

"మోసపోతే గోస పడతామని ఎన్నికలకు ముందు కేసీఆర్ పదే పదే చెప్పారు, అదే ఇవాళ నిజమైందన్నారు కేటీఆర్. మొదటి కేబినేట్ సమావేశంలోనే కాంగ్రెస్ ఇచ్చిన హామీలకు చట్టబద్ధత కల్పిస్తామని రాహుల్ గాంధీ అన్నారు. ఇప్పటి వరకు 30కి పైగా కేబినెట్ సమావేశాలు జరిగినా ఆ ఊసే లేదని విమర్శించారు. బాండ్ పేపర్లు, ప్రామిసరీ నోట్లపై సంతకాలు పెట్టిన రేవంత్ రెడ్డి, భట్టి విక్రమార్క నేడు మాట దాటవేస్తున్నారని మండిపడ్డారు. ఒకవేళ పొరపాటున కాంగ్రెస్‌కు ఓటేస్తే రైతుబంధును కూడా బంద్ చేస్తారని హెచ్చరించారు. కాంగ్రెస్ అసమర్థ పాలనలో రైతులు, నిరుద్యోగులు, మహిళలు, వృద్ధులు.. ఇలా అన్ని వర్గాల ప్రజల పరిస్థితి దయనీయంగా మారిందని కేటీఆర్ ఆవేదన వ్యక్తం చేశారు.'కాంగ్రెస్ బాకీ కార్డు'లోని ప్రతీ అక్షరం రేవంత్ సర్కార్ మోసానికి మిగితా 2వ పేజీలో

# మదర్ డెయిరీ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు షాక్

## మూడింట రెండు స్థానాలు బీఆర్ఎస్ కైవసం

బలగం టీవీ, హైదరాబాద్

మదర్ డెయిరీ డైరెక్టర్ల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి షాక్ తగిలింది హయత్ నగర్‌లో మూడు డైరెక్టర్ల స్థానాలకు జరిగిన ఎన్నికల్లో రెండు స్థానాలను బీఆర్ఎస్ బలపరిచిన అభ్యర్థులు కైవసం చేసుకున్నారు. రచ్చ లక్ష్మీనర్సింహారెడ్డి, సుదగాని భాస్కర్ గౌడ్ విజయం సాధించగా, కర్నాటి జయశ్రీ మరో స్థానంలో గెలుపొందారు. రెండు జనరల్, ఒక మహిళా డైరెక్టర్ స్థానానికి ఎన్నికలు నిర్వహించగా, మొత్తం తొమ్మిది మంది అభ్యర్థులు పోటీలో నిలిచారు. ఈ ఎన్నికల్లో బీఆర్ఎస్ మద్దతుదారులు రెండు స్థానాలను గెలుచుకున్నారు. ఈ ఫలితాల నేపథ్యంలో ఆలేరు ఎమ్మెల్యే ఐలయ్య, యాదాద్రి డీసీసీ అధ్యక్షుడు సంజీవరెడ్డి, మదర్ డెయిరీ ఛైర్మన్ మధుసూదన్ రెడ్డి వ్యవహారశైలిపై కాంగ్రెస్ నేతలు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు.

ఎన్నికలకు ముందే తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్ తీవ్ర విమర్శలు చేశారు. అసెంబ్లీ ఎన్నికల్లో తనను ఓడించేందుకు ప్రయత్నించిన బీఆర్ఎస్ వ్యక్తిని మదర్ డెయిరీ ఎన్నికల్లో నిలబెట్టి మద్దతు ఇవ్వడం సరికాదని ఎమ్మెల్యే ఐలయ్య, డీసీసీ అధ్యక్షుడు సంజీవరెడ్డిపై సామేల్ ఆగ్రహం వ్యక్తం చేశారు.

# మూసీ సుందరీకరణను అడ్డుకుంటున్న కిషన్ రెడ్డి

- టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్

బలగం టీవీ, హైదరాబాద్



బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ముద్దాయిగా నిరూపించబడ్డారని శిక్ష తప్పదని టిపిసిసి చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ తెలిపారు. ఫార్ములా–ఈ కార్ రేసులో కేటీఆర్ తప్పు చేశారని ఆయన స్పష్టం చేశారు. ఢిల్లీలో మీడియాతో మాట్లాడిన మహేష్ కుమార్ గౌడ్, మూసీ సుందరీకరణ ప్రాజెక్టను బిఆర్ఎస్, కేంద్రమంత్రి కిషన్ రెడ్డి అడ్డుకుంటున్నారని మండిపడ్డారు. అభివృద్ధి విషయంలో రాజకీయాలు చేయరాదు అని సూచించారు. అంతేకాక, తెలంగాణకు కిషన్ రెడ్డి తెచ్చిన ప్రాజెక్టులపై చర్చకు సిద్ధం అని సవాల్ విసిరారు. కేంద్రం దగ్గర పెండింగ్‌లో ఉన్న బీసి బిల్లు ఎందుకు ఆమోదం పొందలేదో వివరించమని డిమాండ్ చేశారు. వ "కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి, బండి సంజయ్ ప్రయత్నిస్తే బీసి బిల్లు ఆమోదం పొందగలదు" అని పేర్కొన్నారు.

# బీఆర్ఎస్ 'బాకీ కార్డ్' ఉద్యమం

(మొదటి పేజీ తరువాయి)

నిలువుటద్దమని కేటీఆర్ మండిపడ్డారు. ఏ వర్గాన్ని కూడా వదలకుండా కాంగ్రెస్ ప్రభుత్వం ఎలా నిలువునా ముంచిందో ఆయన అంకెలతో సహా వివరించారు. "అన్నదాతల ఓట్లతో గెలిచిన కాంగ్రెస్ ప్రభుత్వం వారిని అడుగడుగునా దగా చేస్తున్నది. ఎకరానికి ?15,000 ఇస్తామన్న హామీ ఏమైంది? అది బాకీ. రూ. 2 లక్షల రుణమాఫీ ఊసేలేదు, అది బాకీ. వరికి రూ. 500 బోనస్ ఇస్తామని చెప్పి చేతులెత్తేశారు, అది కూడా బాకీనే. ఇక కౌలు రైతులు, రైతు కూలీల కన్నీళ్లను పట్టించుకునే నాథుడే లేడు. వారికి ఇస్తామన్న ?15,000, ?12,000 ఏ గంగలో కలిపారు? ఇవన్నీ బాకీ కాదా?" అని కేటీఆర్ నిలదీశారు. "మా తమ్ముళ్లు, చెల్లెళ్ల ఆశలపై కాంగ్రెస్ నీళ్లు చల్లింది. 2 లక్షల ఉద్యోగాల హామీ బాకీ. నెలకు ?4,000 నిరుద్యోగ భృతి ఇస్తామని చెప్పి, 22 నెలలుగా ప్రతి నిరుద్యోగికి వేలల్లో బాకీ పడింది. ఈ మోసానికి కాంగ్రెస్ ఏం సమాధానం చెప్తుంది?" అని కేటీఆర్ ప్రశ్నించారు."మహాలక్ష్మి పథకం పేరుతో ఆడబిడ్డలను ఇంత దారుణంగా మోసం చేసిన ప్రభుత్వం మరొకటి లేదు. నెలకు ?2,500 ఇస్తామని చెప్పి, ఈ రోజుకు ఒక్కో మహిళకు దాదాపు ?55,000 బాకీ పెట్టారు. ఈ ప్రభుత్వం వచ్చాక పెళ్లైన 8 లక్షల మంది ఆడబిడ్డలకు 8 లక్షల తులాల బంగారం బాకీ. ఇది నయవంచన కాదా?" అని కేటీఆర్ మండిపడ్డారు.

"వృద్ధులు, వితంతువుల ఉసురు ఈ ప్రభుత్వానికి తగలకుండా పోదు. నెలకు ?4,000 పెన్షన్ ఇస్తామని చెప్పి, 22 నెలలుగా ఒక్కొక్కరికి ?44,000 బాకీ పడ్డారు. దివ్యాంగుల విషయంలో మరీ దారుణం. నెలకు ?6,000 ఇస్తామని హామీ ఇచ్చి, కేసీఆర్ పెంచిన ?4,000 మాత్రమే ఇస్తున్నారు. అంటే ప్రతి నెలా ?2,000 కోత పెడుతూ, ఒక్కో దివ్యాంగుడికి ?44,000 బాకీ ఉన్నారు" అని కేటీఆర్ ఆవేదన వ్యక్తం చేశారు."పేదలకు ఇందిరమ్మ ఇండ్లు బాకీ, తెలంగాణ కోసం కొట్లాడిన ఉద్యమకారులకు 250 గజాల స్థలం బాకీ. విద్యార్థినులకు స్కూటీలు, యువతకు ?5 లక్షల విద్యా భరోసా కార్డులు, ఆటో అన్నలకు ?24,000.. అన్నీ బాకీలే. గృహజ్యోతి పథకం కూడా సరిగా అమలు కావడం లేదు. ఇలా చెప్పుకుంటూ పోతే కాంగ్రెస్ బాకీల చిట్టా చాంతడంత ఉంది. ఈ మోసాలన్నింటినీ ప్రజల ముందు ఎండగడతాం" అని కేటీఆర్ స్పష్టం చేశారు.

ప్రజల తరపున గొంతు విప్పుతున్న తమపై కాంగ్రెస్ ప్రభుత్వం కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతోందని కేటీఆర్ మండిపడ్డారు. తమపై ఎన్ని అక్రమ కేసులు పెట్టినా, ఎంత వేధించినా భయపడే ప్రసక్తే లేదన్నారు. ఓవైపు న్యాయపరంగా పోరాడుతూనే, మరోవైపు ప్రధాన ప్రతిపక్షంగా ప్రజల తరపున ప్రభుత్వాన్ని నిలదీస్తామని స్పష్టం చేశారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ప్రతి హామీని అమలు చేసేదాకా వదిలిపెట్టే ప్రసక్తే లేదన్నారు. కాంగ్రెస్ నయవంచనను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లేందుకు తెలుగు, ఉర్దూ, ఇంగ్లీషు భాషల్లో ఈ బాకీ కార్డులను ముద్రించామని, తెలంగాణ ప్రజలను జాగృతం చేసే ఈ ప్రచారానికి మీడియా కూడా సహకరించాలని కేటీఆర్ విజ్ఞప్తి చేశారు.

# రిజర్వేషన్లపై చట్టప్రకారంగానే ముందుకెళ్లాలి

(మొదటి పేజీ తరువాయి)

285ఏని సవరిస్తూ అసెంబ్లీలో తీర్మానం చేశారని.. అసెంబ్లీ తీర్మానం ప్రస్తుతం గవర్నర్ వద్ద పెండింగ్‌లో ఉందన్నారు. గవర్నర్ దగ్గర బీసీ బిల్లు పెండింగ్‌లో ఉండగా.. జీవో విడుదల చేసి ముందుకు పోతాం అంటే ఎలా? అని నిలదీసింది. గవర్నర్ దగ్గర బిల్లు పెండింగ్‌లో ఉన్నప్పుడు జీవో విడుదల చేయడం సరికాదని.. రిజర్వేషన్లు 50శాతం మించకుండా ఉండాలి అనే నిబంధన ఉంది కదా! అని ప్రశ్నించింది. రిజర్వేషన్లపై అడ్వకేట్ జనరల్‌ను అనేక ప్రశ్నలు వేసిన హైకోర్టు దసరా సెలవుల తర్వాత ఈ మ్యాట ర్ వినాలని హైకోర్టును అడ్వకేట్ జనరల్ కోరగా.. అప్పటి వరకు ఎన్నికల నోటిఫికేషన్ ఇవ్వమని చెప్తే మ్యాటర్ మీరు చెప్పినప్పుడు వింటామని బెంచ్ తెలిపింది. ప్రభుత్వాన్ని అడిగి సమాధానం చెబుతామని ఏజీ పేర్కొన్నారు. స్థానిక ఎన్నికలపై ఎస్ఈసీ తరపు న్యాయవాదిని హైకోర్టు అక్టోబర్ 6 వరకు ఎన్నికల నోటిఫికేషన్ ఇవ్వకుండా ఉంటారా? అని ధర్మాసనం ప్రశ్నించింది. బీసీల రిజర్వేషన్లపై చట్ట ప్రకారమే ముందుకెళ్లాలని.. ఈ మేరకు విచారణ అక్టోబర్ 8వ తేదీకి వాయిదా వేసిన డివిజన్ బెంచ్ వాయిదా వేసింది. ఎన్నికల నోటిఫికేషన్ ఇచ్చినా మెరిట్ ఆధారంగా పిటిషన్‌ను విచారిస్తామని కోర్టు స్పష్టం చేసింది.

# నైపుణ్యం పెంచుకోవడానికి అవకాశాలు కల్పిస్తాం

- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి
- 65 ఏటీసీలను వర్చువల్‌గా ప్రారంభం



బలగం టీవీ, హైదరాబాద్

తెలంగాణలోని యువతీ యువకులు తమ భవిష్యత్తును తీర్చిదిద్దుకోవడానికి ప్రభుత్వం అన్ని రకాల అవకాశాలు కల్పిస్తుందని, ఆ అవకాశాలను సద్వినియోగం చేసుకుని భవిష్యత్తుకు ప్రణాళికలు వేసుకోవాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పిలుపునిచ్చారు. నైపుణ్యత కలిగిన యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాల కల్పనతో పాటు విదేశాల్లో ఉద్యోగావకాశాలను అందిపుచ్చుకోవడానికి సహాయకారిగా ప్రభుత్వంలో ప్రత్యేకంగా ఒక విభాగాన్ని ఏర్పాటు చేస్తామని ప్రకటించారు. రాష్ట్రంలోని ఐటీఐలను అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్లుగా మార్చిన నేపథ్యంలో మల్లేపల్లి ఐటీఐ కేంద్రంలో ఏర్పాటు చేసిన కార్యక్రమం నుంచి ముఖ్యమంత్రి రాష్ట్ర వ్యాప్తంగా 65 ఏటీసీలను వర్చువల్‌గా ప్రారంభించారు.మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్ బాబు గారు, పొన్నం ప్రభాకర్ గారు, పొంగులేటి శ్రీనివాస రెడ్డి గారు, సలహాదారు వేం నరేందర్ రెడ్డి గారితో పాటు ఇతర ప్రజాప్రతినిధులతో కలిసి ముఖ్యమంత్రి గారు అధునాతన సాంకేతిక పరిజ్ఞానంతో రూపుదిద్దుకున్న మల్లేపల్లి ఏటీసీని పరిశీలించారు.

అనంతరం అక్కడ జరిగిన సభలో ముఖ్యమంత్రి మాట్లాడుతూ, నైపుణ్యం పెంచుకోవడానికి ప్రభుత్వం అన్ని అవకాశాలను కల్పిస్తుందని, వాటిని సద్వినియోగం చేసుకుని మంచి భవిష్యత్తు కోసం ప్రణాళికలు వేసుకోవాలని యువతకు పిలుపునిచ్చారు. 'ఏటీసీల్లో చదువుకునే ప్రతి విద్యార్థికి ప్రతి నెలా 2000 రూపాయల స్టయిఫండ్ ఇస్తాం. వచ్చే విద్యా సంవత్సరం నుంచి ఈ స్టయిఫండ్ ఇవ్వాల్సిన బాధ్యత ప్రభుత్వానిది. ఇది ఖర్చు కాదు. భవిష్యత్తుకు పెట్టుబడి. పని చేయాలన్న సంకల్పం కావాలి. కష్టపడి పనిచేయాలి. మీకు ఉద్యోగావకాశాలు, పాస్‌పోర్టు తదితర సర్వీసును అందించడానికి ప్రభుత్వంలో ప్రత్యేకంగా ఒక విభాగాన్ని ఏర్పాటు చేస్తాం. మీ భవిష్యత్తుకు పునాదులు వేస్తాం.ఏటీసీల్లో శిక్షణ పొందిన తమ్ముళ్లు, చెల్లెళ్లు తెలంగాణ పునర్నిర్మాణంలో భాగస్వాములు కావాలి. 2047 నాటికి తెలంగాణ 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక శక్తిగా ఎదగడంలో మీ వంతు కృషి చేయాలి. అభివృద్ధిని సాధించాలన్న సంకల్పంతోనే యువతలో సాంకేతిక నైపుణ్యాన్ని నేర్పించాలని ప్రభుత్వం లక్ష్యంగా నిర్దేశించుకుంది.

రాష్ట్రంలో 1956 లో ప్రారంభమైన ఐటీఐలు, క్రమేణా 65 ఐటీఐలకు పెరిగినప్పటికీ గత ప్రభుత్వాలు వీటిని పట్టించుకోలేదు. మారిన కాలానికి ఈ కేంద్రాలు ఏమాత్రం సంబంధం లేకుండా పాతకాలపు ఒరవడిలో నడిచాయి.వాటిని సమూలంగా మార్చి ఆధునిక పరిస్థితులకు అనుగుణంగా నూతన సాంకేతిక పరిజ్ఞానంతో నైపుణ్యం కలిగిన శిక్షణ అందించాలన్న లక్ష్యంతో గత ఏడాది ఇదే ప్రాంగణంలో ఏటీసీలకు పునాదులు వేసుకున్నాం. టాటా టెక్నాలజీస్ సహకారంతో రాష్ట్రంలో 65 ఐటీఐలను ఏటీసీలుగా మార్చడానికి ప్రభుత్వం కేవలం 300 కోట్లు ఖర్చు చేస్తే టాటా సంస్థ 2100 కోట్లు ఖర్చు చేసి ఆధునిక ఏటీసీలను తీర్చిదిద్దారు. మన వద్ద డబ్బుకన్నా ఆలోచన, చిత్తశుద్ధి ఉండాలి. చిత్తశుద్ధి, సంకల్పం ఉంటే సాధ్యం కానిదంటూ ఏమీ లేదు.

ప్రస్తుతం 65 ఏటీసీలకు అదనంగా వచ్చే విద్యా సంవత్సరం నుంచి రాష్ట్రంలో మరో 51 ఏటీసీలను ప్రారంభిస్తాం. ఈ 116 ఏటీసీలు యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించడమే లక్ష్యంగా పనిచేస్తాయి. ఒకప్పుడు ఐటీఐల్లో చదువుకున్న వారికి ఆర్టీసీలో అప్రెంటిస్ చేయడానికి అవకాశం ఉండేది. ఇప్పుడు కూడా మంత్రి పొన్నం ప్రభాకర్ అప్రెంటిషిప్ ఇప్పించే ఏర్పాట్లు చేయాలి.రాష్ట్రంలో ప్రతి ఏటా 1 లక్షా 10 వేల మంది విద్యార్థులు ఇంజనీరింగ్ పట్టా పొందుతున్నప్పటికీ నైపుణ్యం లేని కారణంగా చాలా మందికి ఉద్యోగావకాశాలు రావడం లేదు. నైపుణ్యం లేనిదే ప్రైవేటు కార్పొరేట్ రంగంలో ఉద్యోగాలు ఇచ్చే పరిస్థితి లేదు. అందుకే స్కిల్స్ పెంచాలన్న అంశంపై ప్రభుత్వం దృష్టి సారించింది. యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ, స్పోర్ట్స్ యూనివర్సిటీ లాంటివి ప్రారంభించామంటే మట్టిలో మాణిక్యాలను వెలికి తీయాలన్నదే మా సంకల్పం.చేతుల్లో డిగ్రీలు ఉన్నా స్కిల్స్ లేకపోతే ప్రయోజనం లేదు. నైపుణ్యత కలిగిన వారికి దక్షిణ కొరియా, జర్మనీ, జపాన్, రష్యా లాంటి దేశాల్లో అనేక ఉద్యోగావకాశాలు ఉన్నాయి. కేవలం ఐటీ చదివితేనే ఉద్యోగాలొస్తాయన్న అపోహల్లో బతుకుతున్నాం. అది తప్పు. ఏటీసీల్లో చదువుతున్న యువత నైపుణ్యత సాధించడంపై ఫోకస్ పెట్టాలి.చదువు ఒక్కటే సమాజంలో అసమానతలు రూపుమాపుతుంది. మీకు గౌరవం దక్కుతుంది. చదువు, సాంకేతిక నైపుణ్యం ఒక్కటే మీ తలరాతను మార్చుతుంది. ఈ ప్రభుత్వం మీకు అవకాశాలు, వసతులను ఏర్పాటు చేస్తుంది. చదువుకుని రాణించండి. చదువు లేకపోతే, నైపుణ్యం లేకపోతే ఎందుకూ కొరకాకుండా పోతారు.. అని ఉద్బోధించారు.ఈ కార్యక్రమంలో ఎంపీలు అనిల్ కుమార్ యాదవ్ గారు, డాక్టర్ మల్లు రవి గారు, ఎమ్మెల్సీ, ఎమ్మెల్యేలు, నగర మేయర్ గద్వాల్ విజయలక్ష్మి గారితో పాటు ఉన్నతాధికారులు, టాటా టెక్నాలజీస్ ప్రతినిధులు, ఏటీసీ విద్యార్థులు హాజరయ్యారు.రాష్ట్ర వ్యాప్తంగా వివిధ ఏటీసీల నుంచి స్థానికంగా ప్రజాప్రతినిధులు, విద్యార్థులు వీడియో కాన్ఫరెన్సింగ్ విధానంలో ఈ ప్రారంభోత్సవంలో పాల్గొన్నారు. విదేశీ పర్యటనలో ఉన్న మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి గారు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా తన సందేశాన్ని వినిపించారు.

# జీహెచ్ఎంసీలోని పేదలకు త్వరలో తీపికబురు



బలగం టీవీ, హైదరాబాద్

- మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

జీహెచ్ఎంసీ పరిధిలోని పేదలకు త్వరలో ఇండ్ల మంజూరు చేసేందుకు కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేస్తున్నామని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆలోచన మేరకు అపార్ట్‌మెంట్ తరహా ఇండ్లను అందించేలా తియ్యటి కబురు చెబుతామని రాష్ట్ర రెవిన్యూ, గహ నిర్మాణం, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. ప్రజాపాలన ప్రభుత్వంలో ప్రతి నియోజకవర్గానికి 3500 ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేశామని, గ్రామాల్లో పెద్ద ఎత్తున పనులు పూర్తిచేసుకుని గృహ ప్రవేశాలు జరుగుతున్నాయన్నారు. జీహెచ్ఎంసీ పరిధిలోని అనేక ప్రాంతాలల్లో డబుల్‌బెడ్‌రూం ఇండ్లను గత ప్రభుత్వం మొండిగోడలతో గాలికి వదిలేసిన వాటన్నిటిని యుద్ధప్రాతిపదిక పూర్తిచేసి అందిస్తున్నామని తెలిపారు. నగరంలో అర్హులైన పేదలకు రెండు పడకల గదుల ఇల్లు అందిస్తామన్నారు. శనివారం జీహెచ్ఎంసీ పరిధిలోని కంటోన్మెంట్ నియోజకవర్గంలోగల రసూల్ పురలోని నారాయణ జోపిడి సంఘం వద్ద రూ.22కోట్ల 32లక్షలతో 5బ్లాక్‌లుగా నిర్మించిన 288 డబుల్‌బెడ్ రూం ఇండ్లను సహచర హైదరాబాద్ ఇన్‌చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్, ఎంపీలు ఈటల రాజేందర్, అనిల్ కుమార్ యాదవ్, డిప్యూటిమేయర్ మోతే శ్రీలత శోభన్‌రెడ్డి, జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్‌వీ కర్ణన్, కలెక్టర్ హరి చందన్, ఎమ్మెల్యే శ్రీ గణేష్ తదితరులతో కలిసి ఆయన ప్రారంభించారు.

ఈ సందర్భంగా ఏర్పాటు చేసినసభలో మంత్రి పొంగులేటి మాట్లాడారు. పట్టణ ప్రాంతాల్లో 30 నుంచి 70 గజాలున్నాసరే స్థానికంగా నివసించే వారికి అపార్ట్‌మెంట్ తరహాలో ఇండ్లను నిర్మిస్తామని స్పష్టం చేశారు. ఇందుకు సంబంధించిన కార్యాచరణ రూపొందిస్తున్నామన్నారు. గతంలో కంటోన్మెంట్ ఉప ఎన్నికల సమయంలో ఈ ప్రాంతంలో మొండి గోడలతో ఉన్న ఇండ్లను పూర్తిచేసి ఇస్తామని మాట ఇచ్చానని, దానిని నెరవేర్చామని స్పష్టం చేశారు. నాటి ప్రభుత్వంలో పేదలకు అన్యాయం చేశారని, ఏడాదికి లక్ష ఇండ్లు కట్టినా పదేండ్లలో పదిలక్షల ఇండ్లు పేదలకు వచ్చేవన్నారు. ప్రజా ప్రభుత్వం ఎన్ని ఆర్థిక ఇబ్బందులున్నా తొలివిడతగా 4.50 లక్షల ఇండ్ల నిర్మాణానికి సంకల్పించిందన్నారు. మరో మూడు విడతల్లో కూడా మంజూరు చేస్తామని దీనిలో భాగంగా జీహెచ్ఎంసీ పరిధిలో ఇండ్ల నిర్మాణానికి ప్రత్యేక దష్టి సారిస్తామన్నారు. ఎంపీ ఈటల రాజేందర్, ఎమ్మెల్యే గణేష్‌లు ప్రస్తావించిన అంశాలమేరకు వాజ్‌పేయి కాలనీలో మొండిగోడలతో ఉండిపోయిన ఇండ్లను పూర్తిచేసి లబ్దిదారులకు ఇచ్చేలా అధికారులను ఆదేశించారు. అదేవిధంగా అసంపూర్తిగా ఉన్న ఇండ్లకు మరమ్మతులు, మౌలిక వసతులను పూర్తిచేసి త్వరలో పేదలకు కానుకగా అందిస్తామని వెల్లడించారు. నియోజకవర్గ పరిధిలోని పేదలకు ఎటువంటి ఇబ్బంది రాకుండా 30ఏండ్లకుపైగా నివసిస్తున్నవారి భూములను ఫ్రీహోల్డ్ చేస్తే రాష్ట్ర ప్రభుత్వం తరపున తగు సాయాన్ని అందిస్తామని దీనికోసం ఎంపీ ఈటల రాజేందర్ కేంద్ర ప్రభుత్వం నుంచి తగు ఆదేశాలు తేవాలని సూచించారు. కంటోన్మెంట్ ప్రాంతంలో సౌకర్యాలతో కూడిన శ్మశానవాటికను నిర్మిస్తామని ఈ విషయంలో కూడా కేంద్రం నుంచి అనుమతుల సాధించాలని ఎంపీని కోరారు. అనంతరం పేదలకు ఇండ్ల పట్టాలు పంపిణీ చేశారు.

# రాజన్న సిరిసిల్ల జిల్లాకు నూతన కలెక్టర్

- సందీప్ కుమార్ ఝా బదిలీ
- హరిత నియామకం..



**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల**

రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టర్‌గా పనిచేసిన సందీప్ కుమార్ ఝాను ప్రభుత్వం బదిలీ చేసింది. రాజన్న సిరిసిల్ల జిల్లా నూతన కలెక్టర్‌గా హరితను నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ చీఫ్ సెక్రటరీ (ముఖ్య కార్యదర్శి) రామకృష్ణ రావు ఉత్తర్వులు జారీ చేశారు.



## దేవి శరన్నవరాత్రి ఉత్సవాలలో అన్న ప్రసాద వితరణ

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల**

దేవి శరన్నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని సిరిసిల్లలోని గాంధీనగర్, మార్కెట్ ఏరియాలో శ్రీ తుల్జా భవానీ సేవా సమితి ఆధ్వర్యంలో ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఇందులో భాగంగా, ఈరోజు మూడవ రోజున లలితా త్రిపుర సుందరీ దేవి అవతారంలో అమ్మవారు భక్తులకు దివ్య దర్శనం ఇవ్వడం జరిగింది. అమ్మవారి ఉత్సవాలలో భాగంగా, మూడవ రోజు అన్న ప్రసాద వితరణ కార్యక్రమాన్ని దాతలు ఆడెపు మురళి–శారద దంపతులు ప్రారంభించారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై అమ్మవారి దర్శనం చేసుకుని, అన్న ప్రసాదం స్వీకరించారు. ఈ అన్న ప్రసాద వితరణ కార్యక్రమంలో శ్రీ తుల్జా భవానీ సేవా సమితి అధ్యక్షులు గుండ్లపెల్లి పూర్ణచందర్, అధ్యక్షులు వలస చంద్రశేఖర్, ప్రధాన కార్యదర్శి సాప పురుషోత్తం, కొడం అమర్నాథ్, సభ్యులు అన్నల్ దాస్ సాయిలు, వలస లక్ష్మీనారాయణ, శ్రీరాముల రవిందర్, చిప్ప శ్రీకాంత్, వాసాల లక్ష్మీనారాయణ, చిదుర స్నేహిత్, సాప సతీష్, కోమాకుల ఆంజనేయులు, చిలగాని రాంనారాయణ, శ్రీకాంత్, సాప గణేష్, శ్రీపతి సురేష్, సింగం శరత్, బింగి తిరుపతి, కోయల్ కార్ మనోజ్, చిలగాని సాయి మరియు పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

## సింగరేణి సంస్థలో లాభాల వాటా చెల్లింపునకు విధి విధానాలు ఖరారు

**బలగం టీవీ, హైదరాబాద్**

రాయగిరి: సింగరేణి సంస్థ 2024–25 ఆర్థిక సంవత్సరంలో సాధించిన లాభాల నుంచి 34 శాతం వాటా పర్మనెంట్ కార్మికులు, అధికారులు అందుకుంటారు. మొత్తం చెల్లింపు రూ.802.4 కోట్లు అని యజమాన్యం ప్రకటించింది.

**చెల్లింపు వివరాలు:**

అండర్‌గ్రౌండ్ కార్మికులు: మాస్టర్‌కు రూ.805.37

భూ ఉపరితల ఓపెన్ కాస్ట్ ప్రాజెక్ట్, సీఎస్పీ, జైపూర్ విద్యుత్ కేంద్ర కార్మికులు: మాస్టర్‌కు రూ.637.58

ఇతర విభాగాల్లోని కార్మికులు: మాస్టర్‌కు రూ.588.53

ఇన్సెంటివ్స్ అండ్ గ్రూప్ పనితీరు:

వ్యక్తిగత పనితీరు ఇన్సెంటివ్: రూ.5.61 కోట్లు

గ్రూప్ పనితీరు: రూ.112.34 కోట్లు

మొత్తం మాస్టర్ ప్రతిపాదికపై చెల్లింపు: రూ.684.44 కోట్లు

**కాంట్రాక్ట్ కార్మికులు:**

కాంట్రాక్ట్ కార్మికులకు రూ.5,500 చెల్లింపు, మొత్తం రూ.16.5 కోట్లు

బ్యాంకుల సెలవుల కారణంగా ఈ చెల్లింపులు సోమవారం ఖాతాల్లో జమ కానున్నాయి.

## సిరిసిల్లలో జోయ్ అలుక్కాస్ జ్యువెలరీ బిగ్ ప్రదర్శన

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల**



సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని వాసవీ కల్యాణ మండపంలో శుక్రవారం జోయ్ అలుక్కాస్ జ్యువెలరీ సంస్థ బిగ్ ప్రదర్శన, సేల్స్ కార్యక్రమాన్ని ప్రారంభించింది. ఈ కార్యక్రమాన్ని సిరిసిల్ల మున్సిపల్ కమిషనర్ ఎండీ ఖదీర్‌పాషా మరియు మాజీ చైర్‌పర్సన్ జిందం కళాచక్రపాణి కలిసి ప్రారంభించారు. ప్రదర్శన శుక్ర, శని, ఆదివారాలు మూడు రోజుల పాటు కొనసాగనుందని సంస్థ ప్రతినిధులు ప్రకటించారు. సిద్దిపేట బ్రాంచ్ పరిధిలోని ఈ ప్రదర్శనలో సరికొత్త సేకరణలు, విశిష్ట ఆభరణాలు అందుబాటులో ఉంటాయి. నిర్వాహకులు ప్రకారం, ఈ మూడు రోజుల పాటు గొప్ప తగ్గింపు ఆఫర్లతో విక్రయాలు జరగనున్నాయి. ప్రారంభోత్సవానికి మానేరు స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు చింతోజు భాస్కర్, సిరిసిల్ల ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు ఆకుల జయంత్‌కుమార్, వాసవీ కల్యాణ మండపం ఇన్‌చార్జి సురేశ్, జోయ్ అలుక్కాస్ సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

# మెట్‌పల్లిలో రోడ్డెక్కిన రైతులు

- నాణ్యతలేని విత్తనాల కారణంగా రైతుల రోడ్డుపై ఆందోళన



**బలగం టీవీ, మెట్‌పల్లి**

ఎన్నో ఆశలతో సాగు చేసిన పంట తెగుళ్లు, సుడిదోమ కారణంగా దెబ్బతిన్న తర్వాత రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. మెట్‌పల్లి మండలం పెద్దాపూర్ గ్రామానికి చెందిన సుమారు 40 మంది రైతులు శనివారం మెట్పల్లి వ్యవసాయ మార్కెట్ ఎదుట 63వ జాతీయ రహదారిపై బైఠాయించి తమ డిమాండ్లను వినిపించారు."వానాకాలం పంట కోసం శ్రీలక్ష్మి సీడ్స్ దుకాణం నుంచి కర్నూలుకు చెందిన అగ్రిసిస్ కంపెనీ "అద్భుత్ (కేఎస్ఆర్వీ–136)" వరి విత్తనాలు కొనుగోలు చేశారు.సుమారు 200 ఎకరాల్లో ఈ విత్తనంతో వరి సాగు జరిగింది. అయితే సుడిదోమ, తెగుళ్ల కేవలం అద్భుత్ రకానికి మాత్రమే దెబ్బతీశాయి. నాణ్యతలేని విత్తనాలు అందించడం వల్ల పంట నష్టపోయాము. అగ్రిసిస్ కంపెనీ, సీడ్స్ దుకాణ నిర్వాహకులపై చర్యలు తీసుకుని నష్టపరిహారం ఇవ్వాలి" అని రైతులు డిమాండ్ చేశారు. సమాచారం అందుకున్న పోలీసులు రైతుల వద్దకు వెళ్లి వారితో మాట్లాడారు. పోలీసులు సర్దిచెప్పడంతో రైతులు శాంతించి రాస్తారోకోను విరమించారు. అనంతరం తమ డిమాండ్లతో వినతిపత్రాన్ని మండల వ్యవసా యాధికారి దీపిక, ఎస్ఐ కిరణ్ కుమార్‌కు అందజేశారు.

# ఖతార్‌లో బతుకమ్మ వేడుకలు..

- ఖతార్‌లో తెలంగాణ సంస్కృతి
- కవిత సమక్షంలో ఘనంగా బతుకమ్మ వేడుకలు..



**బలగం టీవీ, దోహా ఖతార్**

ఖతార్‌లో తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలు ఉట్టిపడేలా తెలంగాణ జాగృతి ఖతార్ శాఖ ఆధ్వర్యంలో బతుకమ్మ సంబురాలు అంబరాన్ని తాకాయి. ఈ వేడుకలకు తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఖతార్‌లో నివసిస్తున్న తెలంగాణ బిడ్డలు పెద్ద ఎత్తున తరలివచ్చి పండుగ వాతావరణాన్ని తీసుకువచ్చారు. తెలంగాణ ఆడబిడ్డలతో కలిసి కల్వకుంట్ల కవిత గారు ఉత్సాహంగా బతుకమ్మ ఆడారు, పండుగ శోభను ఇనుమడింపజేశారు.

ఈ సందర్భంగా తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత మాట్లాడుతూ.. ప్రవాసంలో ఉన్న తెలంగాణ బిడ్డల కష్టాలను గుర్తుచేశారు. "తెలంగాణ బిడ్డలు బతుకుదెరువు కోసం బొగ్గుబాయి.. దుబాయికి పోయింద్రు అని చెప్పుకునేటోళ్లం. ఇక్కడికి వచ్చిన మీ కష్టాలు మాకు తెలుసు" అని అన్నారు. తల్లిదండ్రులు, కుటుంబాలను విడిచిపెట్టి ఇక్కడ క్యాంపులల్లో ఉంటూ, మీకు వచ్చే జీతంలో ఎంతో కొంత మిగిల్చి ఇంటికి పంపుతరు. మీ మనసుల ఎంత దుఃఖం ఉంటదో మాకు తెలుసు అని, ఆ దుఃఖం తీరాలని ప్రయత్నం చేస్తున్నాం. త్వరలోనే మీరంతా తెలంగాణకు వచ్చే మంచి రోజులు రావాలని, ఇక్కడే ఉన్నా బాగుండాలని కోరుకుంటున్నామని, ఏ పండుగ వచ్చినా అక్కడ ఉన్న మీ కుటుంబానికి మీరు గుర్తుకు వస్తారని అన్నారు. నా మనసుకు కష్టంగా, బాధగా ఉంది. కానీ జీవితంలో కొన్ని సందర్భాలు వస్తయ్ అని, యుద్ధం చేయాల్సి వచ్చినప్పుడు మనోడైనా.. మందోడు అయినా న్యాయం, ధర్మం ఎటు ఉందో చూడాలే అని అన్నారు. చివరగా, ప్రవాస తెలంగాణ బిడ్డలకు భరోసా ఇస్తూ "మీరు మనసుల మనది ఏం పెట్టుకోకండి. మా సంగతి ఎట్లున్నా తెలంగాణ ప్రజలు బాగుండటం, తెలంగాణ హక్కులను రక్షించడం, తెలంగాణ ప్రజల కోసం కొట్లాడడమే ఊపిరిగా పని చేస్తాం" అని స్పష్టం చేశారు.



## యూత్ ఇన్ పాలిటిక్స్ ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం..

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:**

యువత రాజకీయాల పట్ల ఆసక్తి పెంచుకోవాలని, భవిష్యత్తులో క్రియాశీలక పాత్ర పోషించాలని 'యూత్ ఇన్ పాలిటిక్స్' ఆధ్వర్యంలో ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలో శనివారం రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని సాయి మణికంఠ గార్డెన్స్లో న్యాయవాది కొండాపురం వెంకట్ రెడ్డి, మారావేణి రంజిత్ నేతృత్వంలో ఈ సమావేశాన్ని నిర్వహించారు. "రాజకీయాల్లో యువత" అనే అంశంపై జరిగిన ఈ చర్చా కార్యక్రమంలో మండలంలోని అన్ని రాజకీయ పార్టీలకు చెందిన యువ నాయకులు, అలాగే పార్టీలకు అతీతంగా రాజకీయాలపై ఆసక్తి ఉన్న యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా, పాల్గొన్న యువ నాయకులు తమ అభిప్రాయాలను, ఆలోచనలను తెలియజేశారు. 'యూత్ ఇన్ పాలిటిక్స్' ముఖ్య ఉద్దేశాన్ని, అలాగే రాబోయే రోజుల్లో రాజకీయాల్లో యువత పాత్ర ఏ విధంగా ఉండబోతుందో అనే అంశాన్ని బుర్ర రవితేజ గౌడ్ మరియు నరేష్ నాయక్ లు వివరించారు. రాజకీయాల్లో యువత క్రియాశీలక భాగస్వామ్యం ఆవశ్యకతను, వారి శక్తిని, సామర్థ్యాన్ని సమాజ అభివృద్ధికి ఎలా ఉపయోగించవచ్చో ఈ సమావేశంలో ప్రధానంగా చర్చించారు. ఈ కార్యక్రమంలో బానోత్ తిరుపతి నాయక్, సింగారం దేవరాజు, ప్రమోద్, చల్ల మధు, బి. ప్రవీణ్, లంబ కుమార్, చిందు శ్రీనివాస్, R. సాయితేజ, జితేందర్ రెడ్డి, దయాకర్ రెడ్డి, బత్తుల అరవింద్, బేతి రాము, క్రాంతి కుమార్, శేఖర్, రాజు రెడ్డి, చరణ్ గౌడ్, సాయి ప్రేమ్, ఎల్లం యాదవ్, కొండా సాయి, పొన్నాల వెంకటేష్, ముత్యాల దీపక్ మరియు వివిధ పార్టీల నాయకులు, యువకులు మరియు విద్యార్థులు పాల్గొన్నారు.



# నేడే భారత్ పాక్ ఫైనల్




- **ఈ ఆసియా కప్‌లో దాయాదితో ముచ్చటగా మూడోసారి**
- **అభిషేక్ శర్మ ఆడేది అనుమానం**

**బలగం టీవీ, హైదరాబాద్**

ఆసియా కప్‌లో జైత్రయాత్ర కొనసాగిస్తున్న భారత్ తుది సమరానికి సిద్ధమైంది. చిరకాల ప్రత్యర్థి పాకిస్థాన్‌తో నేడు భారత్ తలపడనుంది. ఇప్పటికే ఈ టోర్నీలో రెండు సార్లు పాక్‌ను ఓడించిన భారత్ ఫేవరేట్‌గా బరిలోకి దిగుతోంది. అయితే ఈ కీలక మ్యాచ్‌కి ముందుకు భారత్‌కు ఊహించని షాక్ తగిలినట్లు తెలుస్తోంది. జట్టు ఓపెనర్ అభిషేక్ శర్మ, ఆల్ రౌండర్ హార్థిక్ పాండ్యాలు గాయపడినట్లు సమాచారం. అయితే దీనిపై ఎలాంటి అధికారిక ప్రకటన లేదు.

శ్రీలంకతో జరిగిన సూపర్-4 మ్యాచ్‌లో అర్ధసెంచరీతో రాణించిన అభిషేక్.. ఫీల్డింగ్ సమయంలో తొడ కండరాలు పట్టేయడంతో మైదానంలోకి రాలేదు.అభిషేక్‌తో పాటు హార్దిక్ పాండ్యా, తిలక్ వర్మలకు కూడా కండరాల సమస్యలు తలెత్తాయి. తొలి ఓవర్‌లో వికెట్ తీసిన హార్దిక్, అనంతరం మైదానం వీడగా, మ్యాచ్ చివర్లో బౌండరీ లైన్‌పై క్యాచ్ పట్టేందుకు దూకిన తిలక్ వర్మ కూడా గాయపడ్డాడు.

అయితే ముగ్గురి గాయాలపై ఆందోళన చెందాల్సిన అవసరం లేదని కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ స్పష్టం చేశారు. "ఉక్కపోత వాతావరణం వల్లే క్రాంప్స్ వచ్చాయి. పెద్ద సమస్యేమీ లేదు. శనివారం రికవరీడే, ఫైనల్‌కు సిద్ధమవుతాం" అని ఆయన తెలిపారు. బౌలింగ్ కోచ్ మోర్నీ మోర్కెల్ కూడా ఇదే అభిప్రాయం వ్యక్తం చేస్తూ, ఆటగాళ్లకు విశ్రాంతి, మసాజ్ సెషన్స్ మాత్రమే ఉంటాయని, ప్రత్యేక సాధన చేయబోమని పేర్కొన్నారు.

ఒకవేళ అభిషేక్, హార్దిక్ ఫైనల్‌కు దూరమైతే టీమిండియాకు పెద్ద నష్టం అవుతుంది. అభిషేక్ శర్మ దూకుడైన బ్యాటింగ్‌తో ఇప్పటికే కీలక ఆటగాడిగా నిలిచాడు. హార్దిక్ పాండ్యా బ్యాట్, బంతితో పాటు ఆల్‌రౌండ్ ఆటగాడిగా జట్టుకు బలాన్ని ఇస్తాడు. వీరిద్దరూ ఆడకపోతే సంజూ శాంసన్ ఓపెనర్‌గా అవకాశం పొందే అవకాశం ఉంది. రింకూ సింగ్ లేదా జితేష్ శర్మ తుది జట్టులోకి రావచ్చు. హార్దిక్ స్థానంలో అర్ష్‌దీప్ సింగ్ ఆడవచ్చు. అయితే, అలా జరిగితే టీమిండియాకు ఒక బ్యాటింగ్ ఆప్షన్ తక్కువవుతుందని నిపుణులు చెబుతున్నారు.

మరోవైపు భారత్‌ను ఓడించి ప్రతీకారం తీర్చుకోవాలనే పట్టుదలతో పాక్ ఉంది.అయితే ఫామ్ చూసుకున్నా.. బలబలాలు పరిశీలించినా.. ఈ మ్యాచ్‌లో టీమిండియాకు పాకిస్థాన్ ఏ మాత్రం పోటీ కాదు. అలా అని పాకిస్థాన్‌ను ఏ మాత్రం తక్కువ అంచనా వేసినా భారత జట్టు మూల్యం చెల్లించుకోవాల్సి ఉంటుంది.



## ప్రపంచ చాంపియన్‌గా శీతల్ దేవి..


- **స్వర్ణం భారత్ ఖాతాలో**

**బలగం టీవీ, హైదరాబాద్**

పారా వరల్డ్ ఆర్చరీ చాంపియన్‌షిప్‌లో భారత క్రీడాకారిణి శీతల్ దేవి ఘనవిజయం సాధించింది. 18 ఏళ్ల ఈ ఆర్చర్.. మహిళల కాంపౌండ్ వ్యక్తిగత విభాగంలో స్వర్ణ పతకాన్ని కైవసం చేసుకుంది. టర్కీకి చెందిన ప్రపంచ నంబర్ వన్ ఆర్చర్ జోజ్నూర్ క్యూర్ గిర్డీపై శీతల్ 146–143 పాయింట్ల తేడాతో గెలుపొందింది. రెండు చేతులు లేని శీతల్.. తన కాళ్లతో బాణం వదిలి ప్రపంచ వేదికపై విజయం సాధించడం విశేషం. గ్వాంగ్జులో జరిగిన ఈ టోర్నీలో ఆమె మాత్రమే చేతులు లేని ఆటగాడు కావడం మరో ప్రత్యేకత. ఇదే పోటీల్లో శీతల్ మూడోసారి పతకాన్ని దక్కించుకుంది. మిక్స్‌డ్ టీమ్ బ్రాంజ్ కాంపౌండ్ ఈవెంట్‌లో తోమన్ కుమార్‌తో కలిసి మరో పతకం కూడా సాధించింది.

## 'ఓజీ'కి కలెక్షన్లు షాక్!


**బలగం టీవీ, హైదరాబాద్**



పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ నటించిన 'ఓజీ' చిత్రం విడుదలైన తొలి రోజే ఘనవిజయం సాధించింది. పవన్ క్రేజ్‌కు తగ్గట్టుగా సినిమా రూ.154 కోట్ల గ్రాస్ వసూళ్లతో రికార్డు సృష్టించింది. అయితే అదే జోరు రెండో రోజుకి కొనసాగుతుందని భావించినా.. కలెక్షన్లు గణనీయంగా తగ్గిపోయాయి. సమాచారం ప్రకారం రెండో రోజు సుమారు రూ.20 కోట్ల నెట్ వసూళ్లు మాత్రమే నమోదయ్యాయని తెలిసింది. తొలిరోజు అభిమానుల హంగామా, టికెట్ ధరల పెంపు కారణంగా ఎక్కువ వసూళ్లు వచ్చినా..టికెట్ ధరలు ఎక్కువగా ఉండటంతో కలెక్షన్లు పడిపోయినట్లు ట్రేడ్ విశ్లేషకులు చెబుతున్నారు. ఇక ముందు వారాంతం, పండుగ సెలవులు ఉండటంతో ఈ వసూళ్లపై ప్రభావం చూపే అవకాశం ఉంది. అయితే తెలంగాణలో బతుకమ్మ పండుగ కోసం ప్రజలు ఊర్లకు వెళ్లిపోవడం, హైదరాబాద్‌ను మూసీ వరదలు ముంచెత్తడం వల్ల 'ఓజీ' కలెక్షన్లు మరింత దెబ్బతినే ప్రమాదం ఉందని సినీ నిపుణులు అంచనా వేస్తున్నారు.

## 'ది ప్యారడైజ్' నుంచి మోహన్ బాబు ఫస్ట్ లుక్

**బలగం టీవీ, హైదరాబాద్**




నేచురల్ స్టార్ నాని కథానాయకుడిగా నటిస్తున్న తాజా చిత్రం 'ది ప్యారడైజ్' నుంచి మరో సాలిడ్ అప్‌డేట్ బయటకు వచ్చింది. దసరా బ్లాక్‌బస్టర్‌తో గుర్తింపు తెచ్చుకున్న శ్రీకాంత్ ఓదెల ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తుండగా, రాక్‌స్టార్ అనిరుధ్ రవిచందర్ సంగీతం అందిస్తున్నారు. ఇప్పటికే విడుదలైన అనౌన్స్‌మెంట్ టీజర్‌కి మంచి స్పందన లభించింది. ప్రస్తుతం షూటింగ్ వేగంగా సాగుతుండగా, చిత్రబృందం కీలక అప్డేట్‌ను పంచుకుంది. కలెక్షన్ కింగ్ మోహన్ బాబు ఈ సినిమాలో ముఖ్య పాత్రలో నటిస్తున్నట్లు ప్రకటించారు. ఆయన ఫస్ట్ లుక్‌ను కూడా రిలీజ్ చేశారు. షర్ట్ లేకుండా మాస్ లుక్‌లో కనిపించిన మోహన్ బాబు ఆకట్టుకుంటున్నారు.

ఈ చిత్రం తెలుగుతో పాటు హిందీ, తమిళ, కన్నడ, మలయాళం, బెంగాలీ, ఇంగ్లీష్, స్పానిష్ భాషల్లో వచ్చే ఏడాది మార్చి 26, 2026న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది. 1980ల కాలంలో హైదరాబాద్‌లో జరిగిన నిజ సంఘటనల




## ఓటీటీలోకి.. 'లిటిల్ హార్ట్స్'

**బలగం టీవీ, హైదరాబాద్**

టాలీవుడ్‌లో చిన్న సినిమాగా విడుదలై సూపర్‌హిట్ సాధించిన 'లిటిల్ హార్ట్స్' ఇప్పుడు ఓటీటీలోకి రాబోతోంది. ఈ సినిమా స్ట్రీమింగ్ డేట్‌ను మేకర్స్ అధికారికంగా ప్రకటించారు. యూట్యూబర్ మౌళి తనుజ్, శివానీ నాగారం జంటగా నటించిన ఈ చిత్రానికి సాయి మార్తండ్ దర్శకత్వం వహించగా, ఆదిత్య హాసన్ నిర్మించారు. రాజీవ్ కనకాల, అనితా చౌదరి, సత్య కృష్ణన్ తదితరులు కీలక పాత్రలు పోషించారు. ఇటీవల థియేటర్లలో విడుదలై యూత్ ఎంటర్‌టైనర్‌గా మంచి విజయాన్ని అందుకున్న ఈ చిత్రం, ఇప్పుడు ఓటీటీ వేదిక ఈటీవీ విన్లో అక్టోబర్ 1 నుంచి స్ట్రీమింగ్ కానుంది. ఈ సందర్భంగా చిత్రబృందం కొత్త పోస్టర్‌ను విడుదల చేసింది.




## దుర్గమ్మను దర్శించుకున్న బాలకృష్ణ

**బలగం టీవీ, హైదరాబాద్**

హిందూపురం ఎమ్మెల్యే, సినీ నటుడు నందమూరి బాలకృష్ణ విజయవాడ ఇంద్రకీలాద్రిపై కనకదుర్గమ్మను దర్శించుకున్నారు. శనివారం ఆలయానికి చేరుకున్న ఆయనకు ఆలయ కమిటీ ఛైర్మన్ రాధాకృష్ణ, ఈవో శీనానాయక్, అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అనంతరం బాలకృష్ణ అమ్మవారి దర్శనం తీసుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ ఛైర్మన్ రాధాకృష్ణ, అమ్మవారి చిత్రపటాన్ని అందజేసి బాలకృష్ణను సన్మానించారు. తరువాత మాట్లాడిన బాలకృష్ణ, ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఉండాలని అమ్మవారిని ప్రార్థించానని తెలిపారు. దసరా నవరాత్రి ఉత్సవాల సందర్భంగా ఆలయంలో చేసిన ఏర్పాట్లు శుభ్రంగా, చక్కగా ఉన్నాయని ప్రశంసించారు. ప్రతి సంవత్సరం మాదిరిగానే ఈసారి కూడా వేలాదిమంది భక్తులు తండోపతండాలుగా వస్తున్నారని పేర్కొన్నారు. అమ్మవారి ఆశీర్వాదాల కోసం కఠోర దీక్షలు తీసుకునే భక్తుల నిబద్ధత అభినందనీయమని అన్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అధికారులు సమన్వయంతో పనిచేస్తున్నారని ఆయన అభినందించారు.

## 'ఓ.. చెలియా' టీజర్ విడుదల

**బలగం టీవీ, హైదరాబాద్**



ఎస్‌ఆర్‌ఎస్ మూవీ క్రియేషన్స్, ఇందిరా దేవీ ప్రొడక్షన్స్ బ్యానర్‌ల మీద రూపాశ్రీ కొపురు నిర్మిస్తున్న చిత్రం 'ఓ.. చెలియా'. నాగ ప్రణవ్, కావేరి కర్ణిక, ఆద్య రెడ్డి ప్రధాన పాత్రల్లో నటించారు. ఈ మూవీకి కథ, కథనం, దర్శకత్వ బాధ్యతల్ని ఎం.నాగ రాజశేఖర్ రెడ్డి నిర్వర్తిస్తున్నారు. ఇప్పటికే సినిమాకు సంబంధించిన పోస్టర్లు, గ్లింప్స్, సాంగ్స్.. అన్నీ కూడా జనాల్లోకి బాగానే రీచ్ అయ్యాయి. రీసెంట్‌గా హీరో మంచు మనోజ్ ఈ చిత్రం నుంచి ఫస్ట్ సింగిల్‌ను రిలీజ్ చేశారు. అది కూడా వైరల్ అవ్వడంతో సినిమాపై అందరిలో మరింత ఆసక్తి పెరిగింది. ఇక తాజాగా హీరో శ్రీకాంత్ ఈ చిత్ర టీజర్‌ను రిలీజ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ,'నాకు టీజర్ చాలా నచ్చింది. యంగ్ టీమ్ అంతా కలిసి ఈ మూవీని తెరకెక్కించినట్టుగా కనిపిస్తోంది. దర్శక, నిర్మాతలకు ఆల్ ది బెస్ట్' అని అన్నారు. హర్రర్, లవ్, యాక్షన్ జోనర్లను మిక్స్ చేయటంతో భయపెట్టించే అంశాలు చాలానే ఉన్నాయని టీజర్ చూస్తే అర్థం అవుతోంది. ఇక ఈ హర్రర్ కాన్సెప్ట్‌లో చేసిన ఈ ప్రేమ కథ ఏంటి?, మధ్యలోకి ఈ దెయ్యాల కాన్సెప్ట్ ఎలా వచ్చింది? అనే ఆసక్తికరమైన అంశాలతో ఉత్కంఠభరితంగా ఈ మూవీని తెరకెక్కించాం. ఈ టీజర్‌లో సురేష్ బాలా కెమెరా వర్క్, ఎంఎం కుమార్ ఆర్ఆర్ హైలెట్ అవుతోంది. ఈ చిత్రానికి ఉపేంద్ర ఎడిటర్‌గా పని చేశారు. త్వరలోనే ఈ మూవీ రిలీజ్ డేట్‌ను ప్రకటిస్తాం అని అని మేకర్స్ తెలిపారు.




## రష్మిక 'థామా'.. ట్రైలర్ రిలీజ్

**బలగం టీవీ, హైదరాబాద్**

రష్మిక మందన్నా కథానాయికగా, ఆయుష్మాన్ ఖురానా హీరోగా నటిస్తున్న హిందీ హారర్ కామెడీ చిత్రం 'థామా' ప్రేక్షకుల ముందుకు రానుంది. ఆదిత్య సర్పోత్దార్ దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమా, మ్యాడాక్ ఫిల్మ్ రూపొందిస్తున్న హారర్-కామెడీ యూనివర్స్‌లో ఐదో చిత్రంగా వస్తోంది. దినేష్ విజన్, అమర్ కౌశిక్ సంయుక్తంగా నిర్మిస్తున్న ఈ చిత్రం దీపావళి కానుకగా అక్టోబర్ 21న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది. ఈ సందర్భంగా మేకర్స్ తాజాగా ట్రైలర్‌ను విడుదల చేశారు.

## మంచి సినిమాలు చేస్తే చూడరు : అనుపమ పరమేశ్వరన్

**బలగం టీవీ, హైదరాబాద్**



'కిష్కింధకాండ' సినిమా ప్రమోషన్స్ సందర్భంగా నటి అనుపమ పరమేశ్వరన్ మీడియా ముందుకు వచ్చారు. ఈ సందర్భంగా ఓ విలేఖరి వేసిన వ్యాఖ్యకు ఆమె ఇచ్చిన రియాక్షన్ ప్రస్తుతం సోషల్ మీడియాలో ట్రెండింగ్ అవుతోంది. విలేఖరి, "మీరు 'టిల్లు స్క్వేర్' లాంటి సినిమాల్లో నటించడం జీర్ణించుకోలేకపోయాం" అని వ్యాఖ్యానించగా, అనుపమ ఒక్కసారిగా సీరియస్ అయ్యారు. వెంటనే స్పందిస్తూ, "మీరు టిల్లు స్క్వేర్ చూసి డైజెస్ట్ కాలేదంటారు కానీ నేను 'పరదా' అనే మంచి ఫీల్‌గుడ్ సినిమా చేశాను. అది చూశారా? చూడరు! ఎందుకంటే అలాంటి మంచి సినిమాలు వచ్చినా ఎవ్వరూ మాట్లాడరు. కానీ హాట్ టాపిక్ ఉంటే మాత్రం ముందువరుసలో ఉండిపోతారు" అని ఘాటుగా సమాధానం ఇచ్చారు.